ప్రజాస్వామ్యం గురించి పౌర సమాజానికీ రాజకీయ సమాజానికీ ఉండే ఆలోచనల మధ్య చాలా అంతరం ఉంటుంది. పౌర సమాజం నిరంతరం మరిన్ని హక్కులను, మెరుగైన జీవితాన్ని కోరుకుంటే రాజకీయ సమాజం యథాతథ స్థితినే కొనసాగించాలని చూస్తుంది. అందుకోసం మరిన్ని అధికారాలను సొంతం చేసుకుని ప్రజలను మరింతగా అదుపులో పెట్టాలని ప్రయత్నిస్తుంది. ప్రజల సమ్మతి తనకు ఉందని చెప్పుకోవడానికి ఎన్నికలలో ఎన్ని వక్రమార్గాలనైనా అవలంబిస్తుంది. అంటే సారంలో ప్రజాస్వామ్యం పౌర సమాజపు ఆకాంక్ష అయితే రూపంలో అది రాజకీయ సమాజ అసలు స్వభావానికి ప్రతీకగానే నిలుస్తోంది.



ఎన్నికలే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు అనే మాట ఎంత హాస్యాస్పదమైపోయిందో మొన్నటి హుజూర్ నగర్, మునుగోడు ఉపఎన్నికలు రుజువు చేశాయి. ఆయా పార్టీలను డబ్బు మద్యమే గెలిపించాయి కాని వారి విధానాలు కాదు. దశాబ్దాల క్రితమే మొదలైన ఈ ప్రలోభాలు క్రమంగా పెరిగి అవే నిర్ణాయకాలుగా మారాయి. ఇప్పుడు ఆ ఓట్ల కొనుగోలును చట్టబద్ధం చేయడానికి బిజెపి సర్కారు ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టింది. వెయ్యి, లక్ష, పదిలక్షలు, కోటి రూపాయల విలువ గల బాండ్లను జారీ చేసింది. ఇప్పటిదాకా అమ్ముడయిన బాండ్లన్నీ కోటి రూపాయల విలువైనవేనట! అంటే కుబేరులే కొంటున్నారు ఆ బాండ్లను. కొని చిత్తం వచ్చిన పార్టీకి ఆ బాండును ఇచ్చుకోవచ్చు. 2018 నుంచి అమలవుతున్న ఈ విధానంలో 75 శాతం బాండ్లు బిజెపి పార్టీకే చేరాయి. అంటే ఇప్పటివరకు 10,246 వేల కోట్ల రూపాయల విలువైన బాండ్లు అమ్ముడైతే 8,000 కోట్ల రూపాయల విలువకు పై బడిన బాండ్లు బిజెపి ఖజానాకే చేరాయి. ఊరికే వస్తాయా ఇన్ని డబ్బులు! ప్రతిఫలం ఉండకుండా ఉంటుందా! గత ఐదేళ్ళ కాలంలో పది లక్షల కోట్ల రూపాయల వరకు పెట్టుబడిదార్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసాము అని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 2న పార్లమెంటుకు తెలిపింది. రెండిట్నీ కలిపి అర్థం చేసుకుంటే చాలు లోగుట్టు ఏమిటో తెలిసిపోతుంది.

# కోల్పోతున్న హక్కుల కోసం కలిసి ఉద్యమిద్దాం...

ఈ పద్ధతుల ద్వారా నిధులు సమీకరించుకుని గెలిచి చట్టసభలలో అడుగుపెట్టాక ఏ రాజకీయ పార్టీ అయినా ఎవరికి సేవ చేస్తుంది? నిధులిచ్చిన పెట్టుబడిదారులకు కాదా! దశాబ్దాల పాటు కార్మికులు పోరాడి ఒకటీ ఒకటీగా సాధించుకుని చట్టాల రూపంలో వ్యవస్థితం చేసుకున్న హక్కుల్ని కాలరాయడానికి కాకపోతే ప్రస్తుత ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఎందుకు ఆమోదించినట్టు? వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కాకపోతే ఆ నాలుగు రైతు చట్టాలను పార్లమెంటు చేత ఎందుకు ఆమోదింపజేసినట్టు? రైతులు పోరాడి ఆ చట్టాల్ని వెనక్కి తిరగ్గొట్టగలిగారు గానీ లేకపోతే...!! బ్రూట్ మెజారిటీ పర్యవసానంగా పార్లమెంటులో ఒక చర్చ గాని, బిల్లు వీగిపోతుందన్న ఒక భయం గాని పాలక ప్రభుత్వానికి లేకుండా పోయింది.

ఎక్కడిదీ బ్రూట్ మెజారిటీ? డబ్బులు, ఇతర రకాల ప్రలోభాలకు ఇప్పుడు కొత్తగా మరొకటి తోడైంది. దాని పేరే హిందూత్వ. మరో మాటలో చెప్పాలంటే హిందూ మతోన్మాదం. మైనారిటీ మతస్తులను ఆగర్భ శత్రువులుగా చిత్రిస్తూ మెజారిటీ మతస్తుల నుండి ఓట్లు దండుకోవడం, వారిపై విద్వేషాన్ని రెచ్చగొట్టడం, హత్యలు చేయడం, వాళ్ళు ఏమి తినాలో, ఎలా బట్టలు కట్టుకోవాలో నిర్ణయించడం, వాళ్ళ ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం, స్థానికతను రుజువు చేసుకోవడానికి వారికి ఆధార్ కార్డ్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాసుబుక్కు, జీవిత బీమా పాలసీ లాంటివి ఏవీ చెల్లవనడం, వారిని పౌరసత్వం లేని వాళ్లుగా చిత్రించడం, వాళ్ళ జాతీయతనూ, స్థానికతనూ రుజువు చేసుకోవాలని కొత్త చట్టాలు చేయడం – ఇవన్నీ మెజారిటీ మతస్తుల నుంచి ఓట్లను గుంజుకోవడానికి బిజెపి ప్రయోగిస్తున్న కుటిల ఎత్తుగడలు.

పలు ప్రాంతాలూ, పలు భాషలూ వికసిస్తున్నప్పుడే కదా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నట్లు. 'గాడ్స్ ఓన్ కంట్రీ'గా పేరొందిన కేరళ, 'సప్త సోదరీమణులు'గా గుర్తింపు తెచ్చుకున్న ఈశాన్య భారతమూ, 'ఈ నేలపై అవతరించిన స్వర్గం'గా ప్రశంసలు అందుకున్న కశ్మీరమూ, రాజస్థాన్‌గా పిల్చుకునే రేగిస్తాన్ వీటన్నిటి సమాహారమే కదా ఇండియా దట్ ఈజ్ భారత్. వ్యాస సంస్కృత భారతమూ, తులసీదాస్ హిందీ రామాయణమూ, కబీర్ దోహాలూ, పోతన తెలుగు పద్యాలూ, రవీంద్రుడి బెంగాలీ జనగణమనలూ, లెక్కకు మిక్కిలిగా గల జానపదుల గీతాలూ.. ఇవే కదా భారతీయ భాషల సౌరభాన్ని నలు దిక్కులకూ ప్రసరింపచేసేవి. 'ఒకే దేశం – ఒకే భాష' పాటను నెత్తికెక్కిచ్చుకుని ఊరేగుతున్న వారికి ఈ వైవిధ్యం ఇష్టం లేదనే కదా మనం ఇప్పుడు అనుకోవాలి. వైవిధ్యం ప్రజాస్వామ్య లక్షణం అనే స్పృహ కూడా లేని మన పాలకుల పాలనను ఏమనాలి? భ్రష్ట ప్రజాస్వామ్యం అనే కదా!

**ఈ మార్పు ఎందుకో స్పష్టమే.**

హిందూ మతోన్మాద రాజ్యం నెలకొల్పడానికే ఈ కుట్ర అంతాను. అందుకోసమే తాము అధికారంలో ఉన్న చోట మత స్వేచ్ఛను హరించే చట్టాలు చేస్తున్నారు. దశాబ్దాల పాటు శ్రమించి నెలకొల్పుకున్న అనేక ప్రజాస్వామ్య సంస్థలను విధ్వంసం చేస్తున్నారు. రిజర్వు బ్యాంకు గౌరవాన్ని నోట్ల రద్దుతో భంగపరిచారు. తాజాగా రిజర్వు బ్యాంకును సంప్రదించకుండానే ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాల గడువును గుజరాత్ ఎన్నికల కోసం పొడిగించారు. ఎన్నికల

## మానవ హక్కుల వేదిక 9వ మహాసభలను జయప్రదం చేయండి

కమిషన్‌ను రిమోట్ కంట్రోల్‌తో నడుపుతున్నారు. సిబిఐనీ, ఈడీనీ రాజకీయ కక్ష సాధింపుకే వాడుతున్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్‌నీ, కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషన్‌నీ స్వేచ్ఛగా పని  చేయనీయడం లేదు. రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను రద్దు చేసి రాజ్యాంగ పరిషత్తుని అవమానించారు.

ఇంత జరుగుతున్నా వారి రాజకీయ, ఆర్థిక విధానాలపై ప్రజల నుండి రావాల్సినంత నిరసన గాని, ప్రతిఘటన గాని రావడం లేదు నిజమే. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం లాంటి ఉద్యమాలు ఎన్నో రావాల్సి ఉంది. కోవిడ్ సమయంలో వలస కార్మికులు పడ్డ కడగండ్లకు వ్యతిరేకంగా, నోట్ల రద్దుకు వ్యతిరేకంగా,  అడవి  నుంచి ఆదివాసులను  తరిమేయడానికి వ్యతిరేకంగా, EWS కు వ్యతిరేకంగా, పెరుగుతున్న ధరలకు, నిరుద్యోగానికి, అవినీతికి వ్యతిరేకంగా, బుల్డోజర్ సంస్కృతికి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు రావాల్సి ఉంది. కాని ఏ మాత్రం నిరసనను, ప్రతిఘటనను సహించే వాతావరణం లేదు కేంద్రంలో, రాష్ట్రాలలో కూడా. అణగారిన వర్గాలకు బాసటగా నిలబడిన వారిపై అత్యంత దుష్ట చట్టాలైన UAPA, NIA లను ప్రయోగించడానికి ఈ పాలకులు ఏ మాత్రం వెనకాడడం లేదు. హక్కుల కోసం మాట్లాడే వారిపై దుష్ప్రచారం చేసి జైళ్లలో నిర్బంధించడం ప్రభుత్వాల పాలసీగా మారిపోయింది.

**మానవహక్కుల వేదిక**

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల 9వ మహాసభలు**

**డిసెంబర్ 17-18, 2022, నిజామాబాద్**

వేదిక  : **మున్నూరు కాపు కళ్యాణ మండపం, ప్రగతి నగర్**

సదస్సు :  17 ఉ॥ 10.00 గం॥ నుండి సా॥ 5.:00 గం॥ల వరకు

ఉదయం  :  **ప్రజాస్వామ్యంపై హిందూత్వ దాడి** : **ఆకార్ పటేల్,** రచయిత

**భూ సమస్యలు - ప్రజల హక్కులు** :  **ఉషా సీతాలక్ష్మి,** పరిశోధకురాలు, కార్యకర్త

మధ్యాహ్నం : **ఆదివాసీ సంస్కృతి - విధ్వంసం**: **ఆకాశ్ పోయం,** ఏషియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజం

సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు, 6 గంటలకు బహిరంగ సభ

సదస్సుకు మరియు బహిరంగ సభకు అందరికీ ఆహ్వానం

డిసెంబర్ 18 సంస్థాగత కార్యక్రమం

## ఎక్కడ చెప్పుకోవాలి?

ఇప్పుడు ప్రజలకు మిగిలిన ఒకే ఒక్క ఆశ కోర్టులు. కానీ వాటి పని తీరు చూస్తుంటే పలు సందేహాలు తలెత్తుతున్నాయి. కోర్టులలో కూడా అవినీతి, బంధు ప్రీతి పెరిగిపోయింది. రిపబ్లిక్ టీవీ అధినేత అర్ణబ్ గోస్వామికి బెయిల్ ఇవ్వడానికైతే అర్ధరాత్రి హియరింగులు, ఆగమేఘాల మీద ఆర్డర్లు జారీ చేస్తారు కాని భీమా కొరెగావ్ కేసులో ముద్దాయి అయిన 84 ఏళ్ళ స్టాన్ స్వామి తనకున్న జబ్బు రీత్యా ఒక స్ట్రా ఇప్పించమని కోర్టుకు పోతే నెలల తరబడి ఆ పిటిషన్ విచారణకే నోచుకోదు. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు ఆదివాసులను చంపిన విషయంలో స్వతంత్ర దర్యాప్తును ఆదేశించండి అని సుప్రీంకోర్టులో పిటీషన్ వేసినందుకు హిమాంశుకుమార్‌కి 5 లక్షల రూపాయల పెనాల్టీ విధించారు. 2002 గుజరాత్ అల్లర్లలో అప్పటి ముఖ్యమంత్రి మోదీ పెద్ద కుట్రకు పాల్పడ్డారని ఆ అల్లర్లలో హత్యకు గురైన ఎహసాన్ జాఫ్రీ భార్య జకియా జాఫ్రీ సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఆ కేసుకు తీస్తా సెతల్వాడ్ అనే మానవ హక్కుల కార్యకర్త అండగా ఉందని ఆమెను జైలులో వేశారు. ఎవరికీ మానవీయ స్పందనలు ఉండకూడదు, ఎవరూ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్  కేసులు వెయ్యొద్దు అని నిరుత్సాహపర్చడం, బెదిరించడం చేయదల్చుకుందా సుప్రీంకోర్టు?

జి ఎన్ సాయిబాబా అనే వ్యక్తిపై సెషన్స్ కోర్టు జరిపిన విచారణ చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పు మీద అప్పటికప్పుడే సెలవు రోజున కూడా బెంచి నడిపి మరీ స్టే ఇచ్చింది సుప్రీంకోర్టు. సంవత్సరాల తరబడి ఏ జైలులో కూడా తెలీని జైలులో మగ్గిపోతున్న కశ్మీరీ యువకుల కోసం హెబియస్ కార్పస్ కేసులు వేస్తే నెలల తరబడి అవి నమోదు కూడా కావు; విచారణకు అసలే నోచుకోవు. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌లైతే ఇప్పటివరకు విచారణకే రాలేదు. ఎలక్టోరల్ బాండ్ల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ వేసిన కేసూలూ అంతే. సుప్రీంకోర్టును కూడా జేబులో వేసుకున్నారా అనే సందేహం ఎవరికైనా ఎందుకు రాదు?

వీటికి తోడు పౌరసమాజంలోని ఆధిపత్య శక్తుల ఆగడాలు ఎలాగూ ఉన్నాయి. స్త్రీలపై, దళితులపై హింస ఏ మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. పర్యావరణాన్ని దెబ్బతీసే అభివృద్ధి నమూనా కొనసాగిస్తూనే ఉన్నారు. పబ్లిక్ వనరులను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం మానుకోలేదు. పెద్దఎత్తున భూములను సేకరించి రైతులను నిర్వాసితుల్ని చేస్తున్నారు. పరిహారం ఇవ్వడంలో నిరాసక్తత చూపిస్తున్నారు. హిందూత్వ శక్తుల విద్వేష ప్రచారం గురించైతే చెప్పనక్కరలేదు, అది రోజురోజుకీ పెరిగిపోతోంది. ఇదిగో ఈ నేపథ్యంలో జరుగుతున్నాయి మానవ హక్కుల వేదిక 9వ మహాసభలు. వ్యవస్థలు విఫలమయ్యాయని మనం చేతులు ముడుచుకుని కూర్చోలేం. విచ్చలవిడిగా జరుగుతున్న ఈ హక్కుల హననానికి ఇప్పుడు పౌరసమాజమే ఎదురొడ్డి నిలవాలి.

కార్మికులు, రైతులు, దళితులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఆదివాసులు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాలవారు క్రమంగా తమ సమస్యల పరిష్కారం కోసమే కాక  సమాజంలోని ఇతరుల హక్కుల కోసం కూడా నిలబడే చైతన్యాన్ని పొందుతున్నారు. అదే ఇప్పుడు మనకున్న ఆశ. పౌర సమాజంలో అవకాశం ఉన్న అన్నిచోట్లా మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్చ జరగాలి. ఈ చర్చలే రేపు భౌతిక శక్తిగా రూపు దిద్దుకుంటాయని ఆశిద్దాం.

**7.12.2022**

మానవ హక్కుల వేదిక
Human Rights Forum (HRF)

ప్రచురణ : జి. మాధవరావు 90594 40011;  యు.జి. శ్రీనివాసులు 91821 88388
ముద్రణ : అనుపమ ప్రింటర్స్, శాంతినగర్, హైదరాబాద్ - 28. ఫోన్ : 040-23391364